క్లుప్తంగా

సామాజిక సమస్యలపై 27న సదస్సు

కపిలేశ్వరపురం (మండపేట): యువజన, విద్యార్థులు కేంద్రంగా సామాజిక సమస్యలపై చర్చించే లక్ష్యంతో ఈ నెల 27న ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్టు మండపేటకు చెందిన సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకుడు డాక్టర్ చల్లా రవికుమార్ మంగళవారం తెలిపారు. ప్రజల మనిషి, హోమియో వైద్యుడు చల్లా వెంకట్రావు 17వ వర్ధంతి సందర్భంగా ఆధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక సమస్యలపై యువజన విద్యార్థులను జాగృతం చేయడంపై దృష్టి సారించామన్నారు. మండపేటలో 27న ఉదయం 9 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్య, కెరీర్ ఎంపిక, వ్యక్తిత్వ వికాసంతో కూడిన జీవనం, సామాజిక జీవితంలో వ్యక్తి పాత్ర, వ్యసనాలు, మాదక ద్రవ్యాలు ప్రభావం తదితర అంశాలపై విద్యార్థి, యువజనులతో కూడిన బృందాలతో చర్చించనున్నామని డాక్టర్ రవికుమార్ తెలిపారు.

వీఆర్వోల సంఘం ఎన్నిక



రామచంద్రపురం మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల స్వామినాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీల ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు సలాది నాయుడు (నాయుడు మాస్టారు), మండల అధ్యక్షుడిగా పైడిమల్ల సత్తిబాబు, కార్యదర్శిగా చీకట్ల వీరాంజనేయులు, కోశాధికారిగా దంగేటి నరేష్, ఉపాధ్యక్షులుగా కె.సత్యవతి, సత్యనారాయణరెడ్డి, మార్కండేయులు, సహాయ కార్యదర్శులుగా ఎస్.నర్మదాదేవి, కె.పరంజ్యోతి, జి.సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎంపికైన నాయుడు మాస్టారు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

గోల్డ్ మెడల్ విన్నర్‌కు అభినందన



గోల్డ్‌మెడల్ సాధించిన జస్వంత్, కోచ్ నాగార్జునలను సత్కరించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం: నేపాల్‌లో ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించిన ఇండో–నేపాల్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2025లో 3 కిలోమీటర్ల పరుగు పోటీల్లో రామచంద్రపురానికి చెందిన విద్యార్థి మేడిశెట్టి జస్వంత్ గోల్డ్‌మెడల్ సాధించడంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అభినందించారు. పోటీల్లో పాల్గొనడానికి సాయం అందించిన మంత్రి సుభాష్‌ను జస్వంత్ కోచ్ నాగార్జునతో కలసి మంగళవారం కలిశారు.

బడి బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

అమలాపురం రూరల్: వర్షాలు కురుస్తున్న కారణంగా బడి పిల్లలతో ప్రయాణించే స్కూల్, కాలేజీ బస్సుల డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంగా రోడ్డు మార్జిన్ గమనిస్తూ జాగ్రత్తగా వాహనం నడపాలని సూచించారు. బడి బస్సులను అతివేగంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపితే డ్రైవర్ల లైసెన్స్ సస్పెండ్ చేస్తామని డీటీఓ హెచ్చరించారు. ఇటీవల రాజోలు వద్ద బస్సును వేగంగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్ లైసెన్స్ 30 రోజులు సస్పెండ్ చేశామని తెలిపారు. ఇప్పటికే అన్ని స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలకు మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు తగు భద్రతా సూచనలు తెలియజేశారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

అమలాపురం టౌన్: ఇంటర్నేషనల్ డే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ హాలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 103 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులు సాధనాల శ్రీసంతోష్, బండారు నానిబాబు, పనిశెట్టి ధరణి వరసగా 3,4,5 స్థానాలను కైవసం చేసుకున్నారని అకాడమి ప్రిన్సిపాల్, కోనసీమ చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. అకాడమి క్రీడాకారులు తామరపు ప్రసన్న, తాడి సాయి వెంకటేష్, వంగలపూడి శిరీష్ గౌతమ్, జాన్ బ్లెస్సీ, తటవర్తి అవ్యక్త ప్రత్యేక బహుమతులు సాధించారని తెలిపారు.

చంద్రబాబు కల్లబొల్లి మాటలు ఇకపై చెల్లవు

- కూటమి పాలన అన్ని రంగాల్లో విఫలం
- ఏడాదిలోనే హామీలపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అంగరలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం



అంగరలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: చంద్రబాబు, కూటమి నేతలు గతేడాదిన్నరగా చెబుతున్న కల్లబొల్లి మాటలకు ఇక కాలం చెల్లిందని, అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం వైఫల్యమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని అంగరలో మంగళవారం కపిలేశ్వరపురం మండల స్థాయి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల సీనియర్ నాయకుడు గూటం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, అంగర, పడమర ఖండ్రిక సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, కార్యదర్శి పలివెల మధు హాజరయ్యారు. మండలంలోని తాతపూడి, అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, కాలేరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, నాగులచెరువు, కోరుమిల్లి, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు మాట్లాడారు.

ర్యాంపుల్లో ఇసుక అక్రమాలు

సభాధ్యక్షుడు గూటం సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కపిలేశ్వరపురం మండలంలోని సామాన్యులు సుఖసంతోషాలతో జీవించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పక్కనపెట్టి మండలంలోని ర్యాంపుల్లో ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాలను వీడియో సాక్ష్యంగా ఉన్నతాధికారులకు నివేదించినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ మహిళా ప్రజాప్రతినిధులను సైతం కూటమి నేతలు వేధిస్తున్నారని విమర్శించారు. జిల్లా యాక్టివిటీ కార్యదర్శి పలివెల మధు, దళిత నాయకుడు పాలింగి కృష్ణకిశోర్, శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి పాలనలో దళిత హక్కులను కాలరాస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య మాట్లాడుతూ ప్రజలిచ్చిన అధికారాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్ వారి సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ అధికారంలోకి ఎన్నికల హామీలను విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. జిల్లా యాక్టివిటీ కార్యదర్శి గుడిమెట్ల రాంబాబు, నాయకులు జిత్తుక వెంకటలక్ష్మి, కట్టా మురళి, పసలపూడి శ్రీనివాస్, శనక్కాయల దొరబాబు మాట్లాడుతూ బలహీన వర్గాలను కూటమి ప్రభుత్వం మోసగించిందన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న గూటం సత్యనారాయణ, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి

కూటమి పాలనపై ప్రజాగ్రహం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచినవారు త్వరితగతిన వాగ్దానాలను అమలు చేయడంపైనే ప్రభుత్వ చిత్తశుద్ధి వ్యక్తమవుతుందన్నారు. ఆ విషయంలో దేశం మొత్తంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రకెక్కారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను మోసగించడంలో ముందుందన్నారు. ఏడాది పాలనా కాలానికే ప్రజలు కూటమి నాయకులపై, పాలనాతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' అని ప్రజలు గుర్తించారని అన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను, ఏడాదిలో మూడు సిలిండర్లకు బదులు ఒక్కటి మాత్రమే ఇచ్చి మహిళలను, రూ.20వేల సాయం ఎగవేసి రైతులను కూటమి ప్రభుత్వం మోసగించిందన్నారు. కూటమి ఇచ్చే ప్రతి హామీకి బాధ్యత వహిస్తానని చెప్పిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాకా హామీల విస్మరణపై నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికెళ్లినా జనం తండోపతండాలుగా వస్తున్నారని ఆయనపై ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇది నిదర్శనమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ప్రజా నాయకుడే అని, గెలిచినా ఓడినా సామాన్య ప్రజల వెంటే ఉన్నారని అన్నారు. వైఎస్ జగన్ పేరు చెప్పగానే సంక్షేమం గుర్తుకొస్తుందని, చంద్రబాబు పేరు చెప్పగానే మోసం, దగా, వెన్నుపోటు గుర్తుకొస్తాయన్నారు. కూటమి హామీలకు ఆకర్షితులైన ప్రజలే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారు

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలు గుర్తుకొస్తారని, మిగిలిన రోజుల్లో వ్యాపారాలు చూసుకుంటుంటారన్నారు. మండలంలోని ర్యాంపు నుంచి భారీ వాహనాల్లో ఇసుక అక్రమంగా తరలిపోవడంలో ఎమ్మెల్యే వేగుళ్ల పాత్ర ఎంతో అందరికీ తెలిసిందేనని అన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులను బనాయించి వేధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలతో కూడిన మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఉన్న చార్టులను ఎమ్మెల్సీ తోట తదితర నాయకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పుట్టా కృష్ణమూర్తి, కొప్పిశెట్టి రామకిశోర్, వంగా నల్లశ్రీను, వాసంశెట్టి వాసు, అతికెల శంభులింగం, సలాది వీరబాబు, పోలిశెట్టి గణేష్, ఉమ్మిడిశెట్టి సూరిబాబు, కారు సుబ్బారావు పాల్గొన్నారు.

అచ్చెన్న వ్యాఖ్యలు హాస్యాస్పదం



తాడి భువనేశ్వరీదేవి

కాజులూరు: ఆడబిడ్డ నిధి పథకం అమలుపై టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర హాస్యాస్పదంగా ఉన్నాయని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, స్థానిక ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. మంగళవారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే జగనన్న పథకాలు అన్నీ కొనసాగిస్తూ వారి కంటే మరిన్ని పథకాలు అదనంగా అమలు చేస్తామని సూపర్ సిక్స్ పేరుతో పలు పథకాలు ప్రకటించారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 చొప్పున ప్రతి నెలా ఇస్తామని టీడీపీ నాయకులు ప్రకటించటంతో మహిళలు నమ్మి ఓట్లు వేశారన్నారు. తీరా ఇప్పుడు పథకాలు అమలు చేయకుండా ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాని అమ్మాలంటూ హాస్యాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కూటమి నేతల తీరు 'ఓడ దాటే వరకూ ఓడ మలన్న, ఓడ దాటాక బోడిమల్లన్న' అన్న సామెతలా ఉందని త్వరలో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

అశిరాంబ అమ్మవారికి పూజలు

కపిలేశ్వరపురం: అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ఆరాధ్యదైవం అశిరాంబ అమ్మవారి జాతర మంగళవారం ముగిసింది. ఈ నెల 20న ప్రారంభమైన జాతర మూడు రోజులు పాటు వైభవంగా సాగింది. మంగళవారం ఆలయం వద్ద ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఇరు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆగస్ట్ 15 లోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు



కందులపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగకుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెం, ఉండూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవా కేంద్రాల వద్ద మంగళవారం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ బి.నాగకుమార్ మాట్లాడుతూ జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మణిదీప్ మాట్లాడుతూ రైతులందరూ ఆగస్టు 15 లోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. మన జిల్లాకు సంబంధించి ఇన్సూరెన్స్ కోసం ఎకరాకు రూ.76 లు ప్రీమియంగా చెల్లించాల్సి ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రూ.38 వేల బీమా అందుతుందన్నారు. కార్యక్రమంలో కందులపాలెం పీఏసీఎస్ చైర్మన్ వైట్ల శ్రీనివాసరావు(రాజబాబు), ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, వీఏఏ శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు చేయించుకోవాలి

కె.గంగవరం: రైతులు పంటల బీమా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని రామచంద్రపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ సూచించారు. మండలంలోని శేరిలంక, కె.గంగవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు పంటల బీమా నమోదు చేయించుకుని ఉంటే ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే నష్టపోకుండా ఉంటారని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ హేమంత్, వీఏఏలు చంద్రశేఖర్, నవ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజా నిర్బంధం అప్రజాస్వామికం



రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాకు సంఘీభావం తెలుపుతున్న పాపారాయుడు తదితరులు

కపిలేశ్వరపురం: రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను గృహనిర్బంధం చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాడటం రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆ హక్కును కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజల ముందు దోషిగా నిలబడాల్సిన రోజు వస్తుందన్నారు. కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తున్న జక్కంపూడి రాజాను నిర్బంధించడానికి 150 మంది పోలీసులను ప్రయోగించడం కూటమి ప్రభుత్వ అసమర్థతను తెలుపుతోందన్నారు. విషయం తెలుసుకున్న కర్రి పాపారాయుడు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్యతో కలిసి రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. జక్కంపూడిని కలిసిని వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, పలివెల సుధాకర్, సాధనాల శివభగవాన్ ఉన్నారు.

వైద్య ఉద్యోగులకు ఘన సన్మానం

అమలాపురం రూరల్: బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వివిధ హోదాల్లో విధులు పనిచేస్తూ వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన వైద్య ఉద్యోగులను పీహెచ్ వద్ద మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వైద్యాధికారిణి గౌతమి ఆధ్వర్యంలో ఈ సన్మాన సభ జరిగింది. డాక్టర్ వాసు నాయక్, డాక్టర్ ఎస్ స్వర్ణకమల, సీహెచ్ఓ కె.శేషుబాబు, పీహెచ్ఎన్ మంగతాయారు, ఎల్టీ ఎం.సుప్రజ, స్టాఫ్‌నర్స్ వై.భారతి, ఎంపీహెచ్ఎస్ రాధా నర్సింహం, ఏఎన్ఎం ఎంవీ రాఘవమ్మ, వీహెచ్ఎస్‌లు ఎం.దేవిరాజేశ్వరి, ఎం.సత్యశ్రీ,నాగలక్ష్మి, కె.విజయ, కె.ఆశలత, సీహెచ్ఓలు పుష్ప, కల్యాణిని ఘనంగా సన్మానించారు.

పసలపూడిలో నేడు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' సమావేశం



సిరిపురపు శ్రీనివాసరావు

రాయవరం: పసలపూడిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండల సీనియర్ నాయకుడు వెలగల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పసలపూడి చైతన్య సుబ్బారాయుడు చారిటబుల్ ట్రస్ట్ సమావేశపు హాలులో నిర్వహించే సమావేశానికి మండలంలోని 12 గ్రామాల పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని సిరిపురపు పిలుపునిచ్చారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం, లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్న దాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వ్యాధి నిర్ధారణ కాకుండా
మందుల వాడకంపై విచారణ

కొత్తపేట: సమగ్ర రోగ నిర్ధారణ చేయకుండా ఒక వ్యాధికి సంబంధించి మందులు వాడించారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై వైద్య విధాన పరిషత్ జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె.కార్తిక్ మంగళవారం విచారణ జరిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంతానికి చెందిన వీవీ పద్మశ్రీ అనే మహిళకు కాలిపై ఒకచోట స్పర్శ లేదని వానపల్లి పీహెచ్‌సీకి వెళ్లారు. పద్మశ్రీ కాలుపై స్పర్శ లేని ప్రాంతంలో బాల్‌పెన్‌తో పరీక్షించి, ఆరు నెలలు మందులు వాడాలని చెప్పి ఒక నెలకు మందులు ఇచ్చారు. ఆ మందులు వాడుతుండగా ఆమె ఆరోగ్యం క్షీణించి పరిస్థితి విషమించింది. దాంతో అమలాపురంలో ఓ ఆస్పత్రిలో చేర్చగా వైద్య సేవలు అందించారు. ఆమె వాడుతున్న మందులు పరిశీలించి ఇవి రోగానికి సంబంధించినవి కాదని అందుకే రియాక్షన్ వచ్చిందని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ చేయకుండా ఏదో మందులిచ్చి తన భార్య విషమ పరిస్థితికి కారకులయ్యారని ఆమె భర్త సుబ్బారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించిన డీసీహెచ్ఎస్‌ను విచారణకు ఆదేశించారు. ఆ మేరకు ఆయన అవిడి పీహెచ్‌సీలో పలువురు అధికారులను, ఫిర్యాదిని విచారించారు. మరొక సిబ్బందిని, పేషెంట్‌ను కూడా విచారించవలసి ఉందని డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తిక్ విలేకరులకు తెలిపారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యతను ఒడిసిపట్టాలి

మలికిపురం: ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం దూసుకుపోతుందని.. అందులో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీ మొదటి ఏడాది నుంచే భావవ్యక్తీకరణ నైపుణ్యాలను ఒడిసి పట్టాలని ఫ్లోరిడాకు చెందిన అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ డైరెక్టర్ అల్లూరి రమేష్ వర్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో త్వరలో ప్రారంభం కానున్న 'కంప్యూటర్స్ హార్డ్‌వేర్, నిర్వహణ' వర్క్‌షాప్, ధ్రువీకరణ పత్రం కోర్సుకు సంబంధించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆనందమహాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఫ్రెషర్లు ఇతర రంగాల కంటే ఐటీ రంగం వైపు మొగ్గు చూపుతున్నారని.. దీనికి కారణం ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం. అంతే కాకుండా వేతనం విషయంలో కూడా ఇతర రంగాల కంటే ఎక్కువగా ఆఫర్ చేస్తుండటమేనన్నారు. మన గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక, విశ్లేషణ, సమస్య పరిష్కార నిపుణత ఎక్కువ అని కాకపోతే ఇతరులతో భావాన్ని వ్యక్తం చేసే ఆంగ్ల పరిజ్ఞానం పొందడంలో వెనుకబడి ఉన్నామన్నారు. దానిని అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తు మనదేనన్నారు.

సుందర సందేశం పుస్తకావిష్కరణ

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో మంగళవారం సుందర సందేశం పుస్తకావిష్కరణ జరిగింది. అంగర లక్ష్మి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంగర గోపాలాచార్యులు (కృష్ణశ్రీ) రచించిన ఈ పుస్తకాన్ని వాల్మీకి రామాయణంలోని సుందరకాండలో కొన్ని ప్రధాన సందేశాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ పుస్తకాన్ని రచించారు. ఈసందేశాత్మక పుస్తకాన్ని గ్రామ పెద్దలు దొడ్డా సుబ్బారావు, సూరపురెడ్డి బాబ్జీ, సూరపురెడ్డి గోపాలకృష్ణ ఆవిష్కరించారు.

వరి పంటలో కాలిబాటల ఆవశ్యకత

- ఆసక్తి కనబరచని రైతులు
- నిర్వహణ, లాభాలపై వ్యవసాయాధికారి సూచనలు

కాజులూరు: వరి పంటలో కాలిబాటలు వేయడం ద్వారా అధిక దిగుబడులు రావడమే కాకుండా పంటపై తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలకు ఆవకాసం ఉంటుంది. అయితే డెల్టాలో కొందరు రైతులు రబీలో కాలిబాటలు వేయటం వృథా ఖర్చుగా భావించి వెనుకడుగు వేస్తున్నారని పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే అదనపు దిగుబడిని పొందవచ్చని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు. పొలంలో కాలిబాటలు వేయడానికి ఎకరానికి రూ.800 ఖర్చయితే నాలుగు బస్తాలు దిగుబడిని అదనంగా పొందవచ్చంటున్నారు. కాలిబాటలు వేసుకునే విధానం, లాభాలపై ఆయన పలు సూచనలు చేశారు.

కాలిబాటలు వేసే విధానం

వరి పొలంలో కాలిబాటలు వేసేందుకు పొడవాటి తాడును గట్టు ఒకవైపు నుంచి గట్టు మరో వైపునకు పట్టుకోవాలి. తాడు పొడవునా ఒక అడుగు వెడల్పున వరి మొక్కలను తీసి పక్కన పలుచగా నాటాలి. పొలంలో గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా చూసుకుని బాటలు వేయాలి. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట పడేలా చూడాలి.

ఉపయోగాలు

కాలిబాటల వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరుపక్కలా ఉన్న కుదుళ్లు అధికంగా దుబ్బు చేస్తుంది. బాటలు వెంబడి నడుస్తూ పంటతెగుళ్లు గుర్తించుటకు కలుపు మొక్కలు ఏరివేయడానికి వీలవుతుంది. రసాయన ఎరువులు సమర్థవంతంగా చల్లుకోవడానికి వీలవుతుంది. చీడపీడలకు, సస్యరక్షణ చేయాల్సిన అవసరముంటే ముందుగా తెగులు సోకిన చోట మందులను పిచికారీ చేసి తదుపరి మిగిలిన చోట చేయవచ్చు. బాటలు వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతిరోజు పొలంలో వరిపంటను సమగ్రంగా పరిశీలించవచ్చు. బాటలు పక్కన ఉన్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, బాటలు వెంబడి తీసిన మూనలు ఖాళీ స్థలంలో ఊడ్చడం వల్ల ఎకరానికి 250 నుంచి 350 కిలోల వరకు దిగుబడిని అదనంగా పొందవచ్చు.



కాజులూరులో వెదజల్లిన పొలంలో వేసిన కాలిబాటలు

ఎంతో ఉపయోగం



రైతులు వరిపొలంలో అదనపు ఖర్చులు ఎందుకని భావించి కాలిబాటలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. నైపుణ్యం గల ఇద్దరు కూలీలను నియమిస్తే రోజుకు రెండు ఎకరాల్లో కాలిబాటలు వేస్తారు. ఆ ఖర్చుకు మించి నాలుగింతల ఆదాయం పెరుగుతుంది.

– కేశన వీర్రాజు, రైతు, అంద్రంగి

వేరు బలపడకముందే బాటలు వేయాలి



నాటిన వరిదుబ్బు వేరు బలపడకముందే పొలంలో కాలిబాటలు వేసుకోవాలి. దాని వలన పని సులువుగా అవుతుంది. మారు నాటిన మొక్క చనిపోకుండా ఉంటుంది. కాలిబాటలలో తీసిన మొక్కలను మూనలు తక్కువగా ఉన్నచోట నాటుకోవాలి. పొలంలో గాలి, వెలుతురు ప్రసరణ సక్రమంగా జరిగి పంటపై తెగుళ్లు తగ్గుతాయి.

– వి.అశోక్, ఏవో, కాజులూరు

తరచూ మాక్ డ్రిల్ నిర్వహించాలి



కొత్తపేటలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆర్డీవో పి.శ్రీకర్ పరిశ్రమల యాజమాన్యం, సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంక్షోభ నివారణ కమిటీ (లోకల్ క్రైసిస్ గ్రూపు) సమావేశం ఆర్డీవో శ్రీకర్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సమీపాన ఉంటున్న ప్రజలకు ఆయా పరిశ్రమలల్లో సంభవించే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (కాకినాడ) కె.రాంబాబు మాట్లాడుతూ ప్రమాదకర కర్మాగారాల్లో తీసుకోవలసిన భద్రత ప్రమాణాలు, ఈ కమిటీ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్థానిక ఎస్సై జి.సురేంద్ర, అగ్నిమాపక అధికారి విజయ్, మెడికల్, పంచాయతీరాజ్ సిబ్బంది, ఇతర కమిటీ సభ్యులు, డివిజన్ పరిధిలోని పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.